క్లుప్తంగా

రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేకం



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని అంకమ్మ తల్లి దేవస్థానంలో రేణుకా పరమేశ్వరుడికి పాల్గుణమాసం ఆరుద్రనక్షత్రం సందర్భంగా సోమవారం ఆలయంలో విశేష పూజాధికాలను నిర్వహించారు. తొలుత స్వామికి నమక చమకాలతో అభిషేకాలు చేశారు. అనంతరం కొర్రపాటి భవన్నారాయణ జ్ఞాపకార్థం విజయలక్ష్మి, శ్రీనివాస్, శ్రీదేవి, గాయత్రి, షణ్ముఖ సౌజన్యంతో స్వామికి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు, కమిటీ సభ్యులు ఉమా మహేశ్వరరావు, మేకా పేరయ్య, తోట రమేష్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



రాపర్ల(పామర్రు): జాతీయ స్థాయి కుంగ్-ఫూ టోర్నమెంట్‌లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని మదర్‌థెరిస్సా స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.పుష్ప యాకోబ్ పేర్కొన్నారు. మండలంలోని రాపర్ల గ్రామంలోని మదర్‌థెరిస్సా స్కూల్లో సోమవారం విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో జరిగిన కుంగ్-ఫూ కరాటే జాతీయ స్థాయి టోర్నమెంట్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థులు గల్లా సిద్ధార్థ, చింతల రేవంత్ ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి గెలుచుకుని బంగారు పతకాన్ని సాధించి సర్టిఫికెట్లను పొందారన్నారు.

జోరుగా జాతీయ రహదారి విస్తరణ పనులు

మండవల్లి: జాతీయ రహదారి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. భీమవరం-విజయవాడ రూట్‌లోని మండవల్లిలో రహదారి విస్తరణ పనులు సోమవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగరాజు మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు పూర్తికావడానికి రెండేళ్లు పడుతుందని తెలిపారు.

క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం



కైకలూరు: క్రీస్తు చూపిన శాంతిమార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. గోపవరంలో శిలువ మార్గం యాత్ర సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిలువను మోస్తూ యాత్రలో పాల్గొన్నారు. కరుణామయుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ దక్కాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉలిసి శ్యామ్‌బాబు, ఆకునూరి వెంకటేశ్వరరావు, కుర్శేల్ల సంజీవ్, గెడ్డాడ కోటేశ్వరరావు, కొనాల ఫ్రాన్సిస్, జింబో, ఏసుపాదం పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



ముదినేపల్లి రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, ఎస్సై బి.వెంకట్‌కుమార్ కోరారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మండలంలోని గురజ, ముదినేపల్లి, సింగరాయపాలెం, దేవపూడి సెంటర్లలో పోలీస్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో సోమవారం కవాతు నిర్వహించారు.

జమ్ము పొదల్లో మంటలు

కైకలూరు: స్థానిక రైతు బజారు ఎదురుగా పేరుకుపోయిన జమ్ము పొదల్లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వచ్చాయి. సమీప హోటల్ యజమాని కంచర్ల బ్రహ్మయ్య అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాల్చిపడేసిన సిగరెట్ పీక వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అగ్నిమాపకశాఖ ఎల్ఎఫ్ ఎంఆర్.భాస్కరరావు, సిబ్బంది పరుశురాముడు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షల నిర్వహణ



పామర్రులో పదో తరగతి పరీక్షకు వెళుతున్న విద్యార్థులు

పామర్రు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు పామర్రు ఎంఈఓ-2 పద్మవాణి పేర్కొన్నారు. పామర్రులో మండలంలో మొత్తం 752 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 44 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వ మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొవ్వ మండలం నుంచి 601 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయాల్సి ఉండగా 21 మంది గైర్హాజరై 580 మంది విద్యార్థులు సోమవారం పరీక్ష రాశారు. పెడసనగల్లు జెడ్పీహెచ్‌ఎస్‌లో 83, నిడుమోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో 41, కూచిపూడి జెడ్పీఓహెచ్‌ఎస్‌లో 68, మొవ్వ జెడ్పీహెచ్‌ఎస్‌లో 249, కోసూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 94, కాజ జెడ్పీహెచ్‌ఎస్‌లో 66 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144ని పక్కాగా నిర్వహించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు తోట్లవల్లూరు పరీక్ష కేంద్రంలో, దేవరపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు పెనమకూరు పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరయ్యారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు తోట్లవల్లూరు కేంద్రంలో 148 మంది, పెనమకూరు కేంద్రంలో 95 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

గుడివాడలో..

గుడివాడటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గుడివాడ డివిజన్ లోని 47 పరీక్ష కేంద్రాల్లో 6,475 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,730 మంది ప్రైవేట్ విద్యార్థులు, మొత్తం 8,205 మంది కాగా 383 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.



తోట్లవల్లూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కైకలూరులో..

కైకలూరు: నియోజకవర్గంలో సోమవారం ప్రశాంత వాతావరణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ లాంగ్వేజీ పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లో 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కైకలూరు మండలం నాలుగు సెంటర్లలో 797 మంది హాజరుకాగా 23 మంది గైర్హాజరయ్యారు. కలిదిండి మండలంలో 887 మంది హాజరుకాగా 66 మంది గైర్హాజరయ్యారు. మండవల్లి మండలంలో 411 మంది హాజరుకాగా 45 మంది గైర్హాజరయ్యారు. ముదినేపల్లి మండలంలో 624 మంది హాజరుకాగా 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ, యలమర్రు హైస్కూల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ వెంట్రప్రగడ హైస్కూల్లో మొత్తం 132 మంది విద్యార్థులకు గాను 122 మంది హాజరయ్యారు. యలమర్రు జెడ్పీ హైస్కూల్లో 98 విద్యార్థులకు గాను 82 మంది హాజరయ్యారు.

జగనన్న పాలనకు ఆకర్షితులవుతున్న యువత



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దూలం వినయ్

ముదినేపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగనన్న ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తనయుడు పార్టీ నియోజకవర్గ నాయకుడు దూలం ఆదివినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వడాలిలో వివిధ పార్టీలకు చెందిన 150 మంది యువకులు సోమవారం వినయ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకోసం యువత అహర్నిశలు శ్రమించి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కటికల మునియ్య, పాండురంగారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువతకు దూలం వినయ్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, బత్తిన కిషోర్, మరీదు హనుమంతు, కోమటి విష్ణువర్ధన్, మత్రివాడ వీరారెడ్డి, సుధాకరరెడ్డి, షేక్‌అల్లాభక్షు, రాచూరి కుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

కలిదిండి: ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు శ్రీఅనుపమ కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం భాగంగా గోపాలపురంలో నాయకులతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి, రేవు నరసింహారావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం



వైవాక శివారు పెదగరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

ముదినేపల్లి రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని వైవాక శివారు పెదగరువు, దేవపూడి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డీఎన్నార్, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ల తరపున ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, అల్లాభక్షు, కట్టా మహేష్, పైడిపాటి వెంకటరమణ, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నందివాడ: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఎంపీపీ పెయ్యల ఆదాం పేర్కొన్నారు. మండలంలోని పెదవిరివాడ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గ్రామ సర్పంచ్ గూడపాటి రజని ఎమ్మెల్యే కొడాలి నాని దృష్టికి తీసుకెళ్లగా బోరు ఏర్పాటు చేసుకుందుకు రూ.13 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పనులు ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే బోరు బావి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లాజర్, వైఎస్సార్ సీపీ నాయకులు కందలు నాగరాజు, గూడపాటి ఇస్సాకు, వెన్న రవికుమార్, మద్దాల యాకోబు, కొత్తూరు ఇస్సాకు, సుధాకర్, ఇమ్మానియేల్, పి.జోసెఫ్‌లు పాల్గొన్నారు.

21 నుంచి అమృతేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం శ్రీగంగా పార్వతీ సమేత శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి సింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ కంతేటి వరలక్ష్మి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 21న స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించి అంకురార్పణ, ధ్వజారోహణం, గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 22 రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న రథోత్సవం, 24న పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలు

సింగరాయపాలెం లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 20 నుంచి 26 వరకు జరుగుతాయని ఆలయ ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మీగడ నెలబాలుడు తెలిపారు.

సంక్షేమం చూసి జగన్‌ను ఆశీర్వదించాలి



పెరికెగూడెంలో జగన్‌ను ఆశీర్వదించాలని కోరుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమం చూసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. మండలంలోని పెరికెగూడెంలో సోమవారం 26వ రోజు ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే డీఎన్నార్‌ను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి దీవించాలన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, బలే నాగరాజు, సర్పంచ్ పెరుమాళ్ల పద్మ పాల్గొన్నారు.

అడపా బాబ్జీకి ఘన నివాళి



బాబ్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా వెంకట రమణ(బాబ్జి) వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నాయకులతో స్నేహ సంబంధాలు కలిగిన మంచి నాయకుడు బాబ్జీ అన్నారు. జూనియర్ కౌన్సిలర్లకు మాదిరిగా ఉంటూ వారికి మున్సిపల్ చట్టాలపై అవగాహన కల్పించేవారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, రామకృష్ణ(ఆర్కే), మెరుగుమాల కాళీ, అద్దేపల్లి పురుషోత్తం, వల్లూరిపల్లి సుధాకర్, చుండూరి శేఖర్, కె.ఆంజనేయ ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహరావు, జోగా సూర్య ప్రకాశరావు, జ్యోతుల సత్యవేణి, మాదాసు వెంకట లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

అడపా బాబ్జీ వర్ధంతిని పురస్కరించుకుని బాబ్జీ యువసేన ఆధ్వర్యంలో స్థానిక ఏజీకే హైస్కూల్ వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కాపు నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పొట్లూరి వంశీ, అడపా పండు, పాలేటి చంటి, అలంకార్ శేఖర్, గంటా చంద్రశేఖర్, సుంకర ప్రసాద్, డి. శ్యాము, పోలాసి బొంబాయి, నల్లమోతు జగదీష్, శ్రీను పాల్గొన్నారు.



అన్నసమారాధన చేస్తున్న బాబ్జీ యువసేన నాయకులు

కొనసాగుతున్న పెద్దింట్లమ్మ జాతర

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర సోమవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా భుజబలపట్నం గ్రామానికి చెందిన ముదునూరి కొండరాజు దంపతులు వ్యవహరించారు. ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామానికి చెందిన కొరిపల్లి ము త్యాలరావు, భాగ్యలక్ష్మి దంపతులు సుమారు రూ. 1.35 లక్షలవిలువ కలిగిన వెండి బిందెను అమ్మవారికి కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా ఈఓ కేవీ గోపాలరావు మాట్లాడుతూ జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే

పామర్రు: దేశంలో ప్రజల పక్షాన నిలబడే ఏకైక పార్టీ కాంగ్రెసేనని రాబోయే కాలంలో కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే అని ఆ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు వింత సంజీవరెడ్డి అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ అసలు సిసలైన ప్రజల పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆ పార్టీకి వంత పాడుతున్న రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు స్వార్థంతో వ్యవహరిస్తున్నాయన్నారు. అనంతరం పెదపారుపూడి మండలం నుంచి జనసేన పార్టీ అధ్యక్షుడు కొప్పుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డీవై దాసు, నాయకులు గణేష్, సురేష్ రెడ్డి, మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, బసవమ్మ, కాగిత సోమేశ్వరరావు, కోటేశ్వరరావు, వేము ప్రసాద్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తోట్లవల్లూరు: మండలంలోని రొయ్యూరు గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. కేసు నమోదు చేసి పట్టుబడిన ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

జగన్ పాలనలో సంక్షేమకాంతులు

ఎమ్మెల్యే డీఎన్నార్



గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం సోమవారానికి 16వ రోజుకు చేరింది. పంచాయతీ పరిధిలోని 9, 10 వార్డులలో ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మరో పర్యాయం ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని డీఎన్నార్ కోరారు. ఇంటింటికీ వెళుతున్నప్పుడు మహిళలు హారతులు పడుతూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తాం అని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమలో కైకలూరు ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, దేవస్థానాల చైర్మన్లు బూరుబోయిన మోహనరావు, గుర్రం రాంబాబు, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రఫీ. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

మంచి చేసి ఉంటే మరోసారి అవకాశం ఇవ్వండి

కైకలూరు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే డీఎన్నార్ కృషి చేశారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సతీమణి వీరాకుమారి కోరారు. మండలంలోని దొడ్డిపట్ల, శీతనపల్లి గ్రామాల్లో సోమవారం ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఆయా గ్రామాల సర్పంచులు చెరుకువాడ బలరామరాజు, సుంద్రు పద్మావతి, వైస్ సర్పంచ్ సురేష్, నాయకులు కర్దం శ్రీనివాసరావు, ఘంటసాల సురేష్, కాసులు, విజయరాజు, గంగుల అశోక్, వడపు ఏసు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు కలసి పనిచేద్దాం

శిక్షణ కలెక్టర్ శ్రీపూజిత



సమావేశంలో మాట్లాడుతున్న శిక్షణ కలెక్టర్ శ్రీపూజిత, ఆర్వో భాస్కరరావు

కైకలూరు: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అధికారులు, మీడియా ప్రతినిధులు కలసి పనిచేయాలని శిక్షణ కలెక్టర్ శ్రీపూజిత చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెయిడ్ న్యూస్‌ను క్షేత్ర స్థాయిలోనే నివారించాలన్నారు. పాత్రికేయులకు అనుమానం వస్తే ఆర్వోకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో యాడ్స్ ఇవ్వాలంటే కలెక్టర్ స్థాయిలో అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల మీద నిఘా ఉంటుందని చెప్పారు. నగదు, లిక్కర్, బహుమతులను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.భాస్కరరావు ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. నియోజకవర్గ కేంద్రంలో మీడియా సెల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కైకలూరు, ముదినేపల్లి తహసీల్దార్ పోతురాజు, ఎస్ఎన్ఎస్.కుమారి, ఎలక్షన్ డీటీలు కిరణ్, ఎండీ.ఇబ్రహీం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామి ఆదాయం రూ. 3.76 లక్షలు



భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం(పెద్దశివాలయం) హుండీల కానుకల లెక్కింపు సోమవారం జరిగింది. కార్యనిర్వాహణాధికారి కె.మౌనిక, పాలక మండలి సభ్యుల సమక్షంలో జరిగిన ఈ లెక్కింపులో 108 రోజులకుగాను రూ.3,76,515 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు, దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు పంచకర్ల వెంకటేశ్వరరావు, సభ్యులు టీఎస్‌వీ సాంబశివరావు, కాంచనకుమారి, పి. సత్యనారాయణ, వజ్రలత, నాగమణి పాల్గొన్నారు.

గౌరీశంకర స్వామి ఆదాయం రూ.1.34 లక్షలు

స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం) హుండీ కానుకలను లెక్కించారు. 57 రోజులకు గాను రూ.1,34,183 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయ పాలక మండలి చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సభ్యుడు బాలకృష్ణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలంపాటలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం -చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చెందిన వివిధ అంశాలకు సంబంధించి ఆలయ ఆవరణలో ఈ నెల 20న టెండర్ కం బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తామని సహాయ కమిషనర్ నేల సంధ్య సోమవారం తెలిపారు. ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి, ప్రసాదాల తయారీకి, సరుకులు సరఫరా చేసేందుకు, తలనీలాలు పోగు చేసుకునేందుకు, వివిధ షాపులు లీజుకు, స్వామికి భక్తులు సమర్పించే ధాన్యం, బియ్యం విక్రయించేందుకు వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు

తోట్లవల్లూరు మండలంలో 3,400 ఎకరాల్లో సాగు



తోట్లవల్లూరులో కళకళలాడుతున్న మొక్కజొన్న పైరు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో మొక్కజొన్న పంట దిగుబడులు, గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉంటుండంతో రైతులు ఆ సాగుపై దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా లంక, మాగాణి భూముల్లో సుమారు 3,400ఎకరాల్లో మొక్కజొన్న పైరు సాగవుతోంది. రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, పాములలంక, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు తది తర గ్రామాల్లో మొక్కజొన్నసాగును రైతులు చేపట్టారు.

పంట కళకళ..

మొక్కజొన్న పంట కళకళలాడుతోంది. వాతావరణం అనుకూలించటం, ఈ ఏడాది తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో ఎక్కడ చూసినా పంట ఏపుగా ఎదిగి మొక్కజొన్న పొత్తులతో పరిఢవిల్లుతోంది. మొక్కజొన్న పైరు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడులపై ఆశలు

మొక్కజొన్న పైరు ఆశాజనకంగా ఉండటంతో రైతులు దిగుబడులపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఎకరానికి 35 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం కూడా మొక్కజొన్నకు గిట్టుబాటు ధర అందిస్తుండటంతో కష్టానికి తగిన ఫలితం వస్తుందని ఆశిస్తున్నారు.

విస్తారంగా సాగు

మండలంలో మొక్కజొన్న పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. కరకట్ట వెంబడి అన్ని గ్రామాల పరిధిలోని లంక, మాగాణి భూములలో మొక్కజొన్న సాగును రైతులు చేపట్టారు. ఈ ఏడాది తెగుళ్ల బెడద పెద్దగా లేదు. ఎకరానికి 45 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

-జి. నాగేశ్వరరావు, ఏఓ, తోట్లవల్లూరు

పంట బాగుంది

మినుముకు తెగుళ్ల బెడద, సాగు ఖర్చులు ఎక్కువ అవుతుండటంతో మొక్కజొన్న సాగుపై దృష్టి సారించాం. వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడులు రావడంతోపాటు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నాం.

– ఎస్.సాయి, కౌలురైతు, తోట్లవల్లూరు